త్యాగరాజు ఆరాధనోత్సవాలు

సామర్లకోట: త్యాగరాజు ఆరాధనోత్సవాలు బుధవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్థానిక సంగీతరావుపేటకు చెందిన నాయిబ్రాహ్మణులు ఏటా త్యాగరాజు ఆరాధనోత్సవాలు నిర్వహిస్తున్నారు. ముందుగా త్యాగరాజు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రత్యేక వేదికపై చిత్రపటాన్ని ఉంచి సంగీతరావుపేటలోని రామాలయం నుంచి నగర కీర్తలతో గ్రామోత్సవం నిర్వహించారు. స్థానిక సంగీత కళాకారుల సంఘ నాయకులు వెదురుపాక బలరాం, మల్లేశ్వరరావు, కె.వెంకటేశ్వరరావుల ఆధ్వర్యంలో త్యాగరాజు ఉత్సవాలు నిర్వహించారు.

వర్గాలకు అతీతంగా సంక్షేమ పథకాలు

- కొండెవరంలో గడప గడపకూలో ఎమ్మెల్యే పెండెం దొరబాబు
- అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన



అంగన్‌వాడీ కేంద్రం నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే దొరబాబు

కొత్తపల్లి: మండలంలోని కొండెవరంలో బుధవారం 2 సచివాలయాలకు సంబంధించిన రూ.40 లక్షలతో చేపట్టబోయే సీసీ రోడ్లు, సీసీ డ్రైన్‌లు, ఇందిరా కాలనీలో రూ.15 లక్షలతో నిర్మించనున్న అంగన్‌వాడీ భవనానికి ఎమ్మెల్యే పెండెం దొరబాబు బుధవారం శంకుస్థాపన చేశారు. ఉప సర్పంచి మేడిశెట్టి శ్రీరాములు, పీఏసీఎస్ అధ్యక్షుడు మారిశెట్టి సత్తిబాబు ఎమ్మెల్యేను స్వాగతించి సత్కరించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు కుల, మత, పార్టీలు, వర్గాలు అనే భేదం లేకుండా అర్హులందరికీ సంక్షేమ పథకాలను అందిస్తున్నామన్నారు. మాజీ ఎమ్మెల్యే వర్మ గ్రామాల్లో తిరుగుతూ వైఎస్సార్ సీపీ చేస్తున్న అభివృద్ధిపై మతి స్థిమితంలేని మాటలు మాట్లాడుతున్నారన్నారు. 2024 ఎన్నికల్లో 175 స్థానాలకు విజయమే లక్ష్యంగా ప్రతీ ఒక్కరూ పనిచేయాలని ముఖ్యమంత్రి జగన్ ప్రభుత్వాన్ని తిరిగి అధికారంలోకి తీసుకురావాలన్నారు. ఎంపీపీ కారే సుధ, జెడ్పీటీసీ సభ్యుడు గుబ్బల తులసీకుమార్, వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు ఆనాల సుదర్శన్, వైస్ ఎంపీపీలు మాదిరెడ్డి దొరబాబు, చెట్టుబత్తిని సురేష్‌కుమార్, కో ఆప్షన్ సభ్యుడు కారే శ్రీనివాసరావు, మండల వ్యవసాయ అభివృద్ధి కమిటీ ఛైర్మన్ జ్యోతుల బాబులు తదితరులు పాల్గొన్నారు.

ఇంజినీరింగ్ విద్యార్థి సౌమ్యకు బంగారు పతకాలు



ఉత్తమ ప్రతిభ కనపర్చిన సౌమ్యకు బహుమతిని అందజేస్తున్న కృష్ణారావు తదితరులు

పెద్దాపురం: స్థానిక పద్మనాభ కాలనీకి చెందిన గొల్ల సౌమ్య ఇంజినీరింగ్ విభాగంలో రెండు పతకాలు సాధించింది. పట్టణంలో మున్సిపల్ శానిటరీ విభాగానికి చెందిన పీహెచ్ వర్కర్ గొల్ల సుబ్రహ్మణ్యం కుమార్తె సౌమ్య ప్రగతి ఇంజినీరింగ్ కళాశాలలో ఇంజినీరింగ్ పూర్తి చేసి హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తోంది. 2020–21 బ్యాచ్‌కు చెందిన సౌమ్య ఇంజినీరింగ్ విభాగంలోని అన్ని గ్రూపులకు సంబంధించి టాపర్‌గా నిలిచి బంగారు పతకం సాధించింది. అకడమిక్ ఇయర్ టాపర్‌గా మరో గోల్డ్ మెడల్ సాధించింది. పారిశుధ్య కార్మికుడి కుమార్తె ఉత్తమ ప్రతిభ కనపరిచి బంగారు పతకాలు సాధించి, ప్రగతి ట్రస్ట్ నుంచి ఉత్తమ విద్యార్థి నగదు బహుమతిని ఏపీ ఉన్నత విద్యామండలి ఛైర్మన్ హేమచంద్రారెడ్డి, ప్రగతి కళాశాల ఛైర్మన్ కృష్ణారావుల చేతుల మీదుగా అందుకుంది. ఉత్తమ ప్రతిభ కనబరిచిన సౌమ్యను పులువరు ప్రముఖులు, అధికారులు ప్రత్యేకంగా అభినందించారు.

వందే భారత్ ఎక్స్‌ప్రెస్‌కు స్వాగతం

సామర్లకోట: సికింద్రాబాద్ నుంచి విశాఖపట్నం వరకు ఏర్పాటు చేసిన వందే భారత్ ఎక్స్‌ప్రెస్‌కు బుధవారం సామర్లకోటలో స్వాగతం పలికారు. ఈ రైలు ఈనెల 19 నుంచి నడుపుతున్నారు. దీనిలో భాగంగా బుధవారం వందేభారత్ ఎక్స్‌ప్రెస్ ట్రయిల్ రన్ నిర్వహించారు. రాజమహేంద్రవరం తరువాత ఈ రైలు విశాఖపట్నంలో మాత్రమే ఆగుతుంది. ఈ మేరకు సామర్లకోట వచ్చిన రైలుకు రైల్వే స్టేషన్ మేనేజర్ ఎం.రమేష్ ఆధ్వర్యంలో స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో ఆర్పీఎఫ్ ఎస్సై ఎన్.రామకృష్ణ ఇతర సిబ్బంది పాల్గొన్నారు. ఆయా రైల్వే ముఖ్య కూడలి ప్రదేశాల్లో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

కొత్తపల్లి: చికిత్స పొందుతూ ఒక యువకుడు ప్రయివేటు ఆసుపత్రిలో మృతి చెందినట్లు బుధవారం పోలీసులు తెలిపారు. వారు తెలిపిన వివరాల ప్రకారం వాకతిప్ప గ్రామానికి చెందిన గోనెల శాంతిస్వరూప్ (30) కొత్తపల్లి పీఏసీఎస్‌లో గుమాస్తాగా పనిచేస్తున్నాడు. గత ఏడాది డిసెంబరు 31న కార్యదర్శి వై.వీరవెంకట సత్యనారాయణమూర్తి ఫ్లెక్సీ కట్టమని తిట్టడం, 30వ తేదీన కొండెవరానికి చెందిన చెలికాని జగదీష్‌తో వివాదం జరగడంతో మనస్తాపం చెంది 31న పంట పొలంలో పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. దీంతో అస్వస్థతకు గురయిన శాంతిస్వరూప్‌ను చికిత్స నిమిత్తం కాకినాడలోని ఒక ప్రయివేటు ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. దీంతో వాకతిప్పలో విషాద ఛాయలు అలుముకున్నాయి. ఎస్సై రామలింగేశ్వరావు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ప్రతీ విద్యార్థి అంతర్జాతీయ క్రీడాకారుడిగా ఎదగాలి

- కలెక్టర్ కృత్తికా శుక్లా



శ్రీ ప్రకాష్ టీటీ క్రీడాకారులనుద్దేశించి ప్రసంగిస్తున్న కలెక్టర్ కృత్తికా శుక్లా

పెద్దాపురం: విద్యార్థి దశ నుంచే ప్రతి ఒక్కరూ క్రీడలపై ఆసక్తి కనపర్చి అంతర్జాతీయ క్రీడాకారులుగా ఎదగాలని జిల్లా కలెక్టర్ కృత్తికా శుక్లా అన్నారు. పెద్దాపురం శ్రీ ప్రకాష్ సినర్జీ పాఠశాలలో నిర్వహిస్తున్న జాతీయ స్థాయి టేబుల్ టెన్నిస్ పోటీలకు హాజరైన క్రీడాకారులనుద్దేశించి బుధవారం ఆమె ప్రసంగించారు. రాష్ట్రంలోనే ఎక్కడా లేని విధంగా కాకినాడ జిల్లాలో అత్యాధునిక ప్రమాణాలతో నిర్మించిన శ్రీ ప్రకాష్ టీటీ అకాడమీ నుంచి నాణ్యమైన క్రీడాకారులను తయారు చేయాలన్నారు. క్రీడలకు ఉన్నత స్థానాన్ని కల్పించిన శ్రీ ప్రకాష్ యాజమాన్యాన్ని అభినందించారు. సభకు అధ్యక్షత వహించిన పాఠశాల డైరెక్టర్ సీహెచ్ విజయ్‌ప్రకాష్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి తమ నైపుణ్యాన్ని కనపర్చి గెలుపునకు ముందడుగు వేయాలన్నారు. 24 క్లస్టర్‌ల నుంచి సుమారు 1,500 మంది క్రీడాకారులు ఐదురోజుల పాటు జరిగే టీటీ పోటీల్లో పాల్గొంటారన్నారు. క్రీడల్లో గెలుపు ఓటములు సహజమన్నారు. స్లోవేనియాకు చెందిన ఫ్యాకల్టీ డాక్టర్ దంజన్‌కోబాల్, మలేషియాకు చెందిన డాక్టర్ మురుగన్‌రాజు, ప్రొఫెసర్ మిరియం అమృత్, మహారాష్ట్ర యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ఆర్‌ఎస్ మాలీ, అకడమిక్ సలహాదారు డాక్టర్ మాధవరావు (మెల్‌బోర్న్) ప్రసంగించారు. అనంతరం విద్యార్థులకు సైరస్ రైస్ ఇండస్ట్రీస్ అందించిన బియ్యం, ఇడ్లీ రవ్వ, గోధుమ పిండితో కూడిన కిట్లను కలెక్టర్ చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఆర్డీఓ జేఎస్ రామారావు, తహస్దిలార్ జితేంద్ర, పాఠశాల సీనియర్ ప్రిన్సిపాల్ మూర్తి, రిఫరీలు సూర్యారావ్, వేణుగోపాల్, లలితా ఇండస్ట్రీ ఈడీ మట్టే ఆదీష్ పాల్గొన్నారు.

జాతీయ స్థాయి సమావేశాన్ని విజయవంతం చేయాలి

పెద్దాపురం: ప్రస్తుత సమాజంలో దైవజనుల ఐక్యత ఎంతో ప్రాముఖ్యమైందని నేషనల్ క్రిస్టియన్ బోర్డు అధ్యక్షుడు జానా మాసా అన్నారు. మండలంలోని వడ్లమూరులోని కె.ఆశీర్వాదం చర్చిలో బుధవారం 22 మండలాల కో–ఆర్డినేటర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జాతీయ అధ్యక్షుడు జాన్ మాసా మాట్లాడుతూ ఈ నెల 18న విజయవాడలో నిర్వహించే జాతీయ స్థాయి సమావేశాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. తొలుత పాస్టర్ రాజేష్ దైవ ప్రసంగాన్ని అందించారు. అనంతరం సమావేశానికి హాజరైన దైవజనులకు వస్త్రాలు, క్యాలెండర్లు, డైరీలను ఆయన అందజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు నవీన్‌కుమార్, సెక్రటరీ డేవిడ్‌మార్క్, రాష్ట్ర బోర్డు మెంబర్ పీటర్ ఆయా సంఘాల దైవజనులు పాల్గొన్నారు.











అలరించిన సంక్రాంతి సంబరాలు



సామర్లకోట బచ్చు ఫౌండేషన్ మున్సిపల్ హైస్కూల్లో ముగ్గులను పరిశీలిస్తున్న ఉపాధ్యాయులు



పెద్దాపురం ఆదిత్య పాఠశాలలో విద్యార్థుల సంక్రాంతి సంబరాలు



పాఠశాలలో నిర్వహిస్తున్న ముగ్గుల పోటీలు

సామర్లకోట: స్థానిక బచ్చు ఫౌండేషన్ మున్సిపల్‌లో బుధవారం ముందస్తు సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. గురువారం నుంచి సంక్రాంతి సెలవులు ప్రభుత్వం ప్రకటించడంతో ముందుగా సంబరాలు నిర్వహించారు. జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత తోటకూర సాయి రామకృష్ణ సంక్రాంతి పండగ విశిష్టతను వివరించారు. పీడీ తాళ్లూరి వైకుంఠం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

స్థానిక ప్రతిభా విద్యానికేతన్‌లో హైకోర్టు న్యాయవాది ఎం.విజయ్ ముఖ్య అతిథిగా పాల్గొని సంక్రాంతి విశిష్టతను వివరించారు. వివిధ సాంస్కృతిక ప్రదర్శనలో విజేతలకు బహుమతులు అందజేశారు. పాఠశాల కరస్పాండెంట్ ఎస్‌వీవీజీ ప్రకాష్, డైరెక్టర్ ఎస్.సుధారాణి, ప్రిన్సిపాల్ టి. సునీత పాల్గొన్నారు.

కొత్తపల్లి: మండల పరిధిలో వీవీఎస్ విద్యాసంస్థల కరస్పాండెంట్ ఎ.కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. బొమ్మల కొలువు ఏర్పాటు చేశారు. అష్టలక్ష్ములుగా విద్యార్థినులు ఆకట్టుకున్నారు. సంస్కృతి సంప్రదాయాలకు ప్రాధాన్యమిస్తూ కార్యక్రమాలు నిర్వహించారు.

పెద్దాపురం: మండలంలోని కట్టమూరు ఎస్సీ కాలనీ ఎంపీపీ ప్రైమరీ స్కూల్లో హెచ్‌ఎం రామలక్ష్మి, కాంప్లెక్స్ హెచ్‌ఎం సత్యవేణిల ఆధ్వర్యంలో విద్యార్థులు భోగి మంటను వేసి హరిదాసు వేషధారణ, సంప్రదాయ దుస్తులతో సందడి చేశారు. ముగ్గుల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులను అందజేశారు. అలాగే స్థానిక ఆదిత్య విద్యా సంస్థల ఆధ్వర్యంలో ప్రిన్సిపాల్ డి.శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన సంక్రాంతి సంబరాలు జరిగాయి. విద్యా సంస్థల డైరెక్టర్ నల్లమిల్లి శృతిరెడ్డి ఆధ్వర్యంలో వివిధ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులను అందజేశారు.

ఆర్డీఓ కార్యాలయాన్ని పరిశీలించిన కలెక్టర్

పెద్దాపురం: స్థానిక ఆర్డీఓ కార్యాలయాన్ని బుధవారం సాయంత్రం జిల్లా కలెక్టర్ కృత్తికా శుక్లా పరిశీలించారు. పట్టణంలో ఓ కార్యక్రమానికి హాజరైన ఆమె ఆర్డీఓ కార్యాలయానికి వెళ్లి మీటింగ్ హాల్, స్పందన, వీడియో కాన్ఫరెన్స్, ఆర్డీఓ చాంబర్, భూ సేకరణ, రీ సర్వే రికార్డులను పరిశీలించారు. సిబ్బంది పనితీరు, రికార్డుల నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేశారు.

వైభవంగా ధనుర్మాస మహోత్సవాలు

పిఠాపురం: పంచమాధవ క్షేత్రమైన కుంతీమాధవస్వామి ఆలయంలో వార్షిక ధనుర్మాస మహోత్సవాలను వైఖానస ఆగమశాస్త్ర ప్రకారం ఘనంగా నిర్వహిస్తున్నారు. బుధవారం స్వామికి విశేష పూజలు చేశారు. గోదా దేవికి 108 గిన్నెల పాయసం నివేదించారు. ఈ నెల 14తేదీ వరకూ మహోత్సవాలు నిర్వహించన్నునట్లు తెలిపారు.

లేగ దూడల ప్రదర్శన

పిఠాపురం: గొల్లప్రోలు మండలం ఏకే మల్లవరంలో బుధవారం పశు సంవర్ధక శాఖ, పశుగణాభివృద్ధి సంస్థల ఆధ్వర్యంలో జాతీయ కృత్రిమ గర్భాధారణ వల్ల పుట్టిన లేగ దూడల ప్రదర్శన నిర్వహించారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. కాకినాడ పశుగణాభివృద్ధి సంస్థ ఉప సంచాలకులు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, సంయుక్త సంచాలకులు ఎస్.సూర్యారావు తదితరులు పాల్గొన్నారు.









